Thursday 8 Sep 2005

ఆంధ్రజ్యోతి

# డల్లాస్‌లో డాక్టర్ శోభారాజు మ్యూజికల్‌నైట్



మూర్తి ములుకుట్ల, ప్రసాద్ తోటకూర, డాక్టర్ శోభారాజు, డాక్టర్ రాఘువేంద్రప్రసాద్

డల్లాస్, సెప్టెంబర్8: ప్రముఖ సంగీత విద్వాంసురాలు డాక్టర్ శోభారాజు తన సంగీతంతో ప్రవాస భారతీయులను అలరించారు. అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన సంగీత కార్యక్రమంలో తన గానామృతంతో ప్రేక్షకులకు వీనులవిందు చేశారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్(టేన్‌టెక్స్), అకాడమీ ఆఫ్ ఆసియన్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్వహించిన సంగీత కార్యక్రమంలో శోభారాజు పాల్గొన్నారు. సుమధుర కంఠంతో శోభారాజు అన్నమాచార్య సంకీర్తనలను ఆలపిస్తుంటే కార్యక్రమ ప్రాంగణం అంతా ప్రేక్షకులతో కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా అన్నమాచార్య కీర్తనల్లో ''అదివో అల్లదివో'', ''బ్రహ్మమొక్కటే'' మళ్లీ మళ్లీ పాడాలని ప్రేక్షకులు కోరారు. శోభారాజు ఆనందంతో తన మృదుమధుర గళంతో ఆ కీర్తనలు పాడి ప్రేక్షకులను రంజింపి చేశారు. అంతకుముందు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ట్రస్టీ బోర్డు చైర్మన్ తోటకూర ప్రసాద్ శోభారాజుకు స్వాగతం పలికి సభకు పరిచయం చేశారు.

డాక్టర్ శోభారాజు పద్నాలుగేళ్ల చిరుప్రాయంలో ప్రఖ్యాత సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు సంగీత సారథ్యంలో అన్నమాచార్య కీర్తనల ఆల్బమ్‌ను విడుదల చేశారు.

అన్నమాచార్య కీర్తనలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చెసెందుకె తన జీవితాన్ని అంకితం చేశారు. హైదరాబాద్‌లో అన్నమాచార్య భావన వాహిని నెలకొల్పి అధ్యక్షురాలిగా ఉన్నారు. డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, మూర్తి ములుకుట్ల, డాక్టర్ శర్మ గుంటూరిలు డాక్టర్ శోభారాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (టేన్‌టెక్స్) శోభారాజును "అభినవ అన్నమయ్య" బిరుదుతో సత్కరించారు.